స్కెచ్

# మరువలేని ఒక కంఠం

"ప్రమీల"

నన్ను పాట పాడమని అడిగి పాడడం పూర్తి అయినతర్వాత మా మీనాక్షి అంటూవుండేది, "అబ్బా! సంగీతంలో నిజంగా ఎంత మాధుర్యం ఉంది!" అని. మా సుశీల కూడా అదేవిషయాన్ని వేరొకలాగ వ్యక్తపరుస్తూ, "నిన్నెవడు చేసుకుంటాడోగాని గొప్ప సౌఖ్యం అనుభవిస్తాడే! అన్నం, పానం లేకపోయినా నువ్వు ఏదైనా ఒక తీయని పాట పాడితే చాలు—అలా జిల్ అయిపోయి నిన్ను చూస్తూ కూర్చుంటాడనుకో!" అని.

నాకు పాటలు వచ్చినా అదేమిటో ఎవరైనా పాడుతూంటే వినటం నాకు చాలా సరదా. కాని అదేం ఖర్మమోగాని నా స్నేహితుల్లో ఎవరికీ పాటరాదు. కాని రాగాలు తీస్తారనుకోండి. "ఏమర్రా! ఒక పాట పోనీ నెమ్మదిగానైనా పాడండి. నాకు మీరు పాడుతుంటే వినాలని ఉంటుంది!" అంటే ససేమిరా నోరు కదల్చరే! వినటానికి రేడియో లేదా అంటారేమో! అది వేరు. ఎదురుగా మనిషిని పెట్టుకు పాట వింటూంటే అది వేరే ఆనందాన్నిస్తుందికదా!

కాని నా జీవితంలో ఒకసారి మాత్రం అలా నాకు నచ్చే గాత్రం వినే అవకాశం దొరికింది. అదీ క్షణికమనే చెప్పాలి.

* * *

చాలా రోజులక్రిందటి సంగతి. మేమంతా బి. యి. డి. చదువుతున్న రోజులు. ఆ బి.యిడి. ట్రైనింగులో మకు వాళ్లు నేర్పని విద్యంటూ ఉండదు. అక్కడే మేము బేసిక్ శిక్షణకూడా పొందాలి. దానికోసం ఒక నెలరోజులు ట్రైనింగ్ యిస్తారు. మా లేడీస్ కాలేజీతో బాటు ఒక మెన్స్ కాలేజి వాళ్లుకూడా అక్కడికి వస్తారని ముందే విన్నాం.

అక్కడ జరగవలసిన పనులతో బాటు నాటకాలు, పాటలు, ఇంకా యిలాంటి పరదాలన్నీ ఉంటాయి. ఇవన్నీ ఊరికే ఊసుపోకనేమో!—అని అనుకునేరు. కాదు, ఇవి కూడా అక్కడ కార్యక్రమములోని భాగమే. ఆ బేసిక్ కాలేజీ ప్రిన్సిపాల్ గారు మేమంతా వెళ్ళిన రెండో రోజున కాబోలు మా ఆడపిల్లల్ని అడిగారు. "అమ్మా! మీలో పాట వచ్చిన వాళ్ళంతా నా గదికి సాయంత్రం ఒక మారు రండి. శాస్త్రీయ సంగీతమే రానక్కరలేదు. లైట్ మ్యూజిక్ అయినా సరే!" అని. సరే, మాలో కొందరం ఆ సాయంత్రం అక్కడ హాజరయ్యాము. మొగపిల్లలుకూడా ఆరుగురో, ఏడుగురో వచ్చారు. నేనన్నాను — "ఏమేవ్! లక్ష్మీ! మన సోదరులుకూడా వచ్చారు. ముందు వాళ్ళ చేత పాడిద్దాం, ఏం?" అని. పాట వచ్చిన వాళ్ళని నాటకాలలోకి సెలక్టుచెయ్యడానికి ప్రిన్సిపాల్ గారు యీ పరీక్షలాంటిది పెట్టారన్నమాట.

మేమనకున్నట్టే ప్రిన్సిపాల్ గారు ముందు అబ్బాయిలనే మొదలుపెట్టమన్నారు. ముందు ఎవరో యిద్దరు, ముగ్గురు పాడారు. తర్వాత ఒక అబ్బాయి పాడబోయేసరికి ప్రిన్సిపాల్ అతనితో యిలా అన్నారు:

"ఏమోయ్! నీ పేరేమిటి?"

"మధుమూర్తండీ."

'ఓహో! సరే, నీకు సంగీతంలో ప్రవేశముందా? లేక—"

"లేదండీ, ఏదో గాలిపాటలు పాడతాను."

వాళ్ళిద్దరూ ఇలా మాట్లాడుతుంటే మా దృష్టి అటులేక, ఏమీ వినిపించుకోనలేదు. మాలో మేము ఏదో గుడగుడలాడుతున్నాం. కాని ఆ అబ్బాయి పేరుమాత్రం నా చెవిలో పడ్డని. ఇంకా మేము అలా గుసగుసలాడుతుండగానే మానోళ్ళకు తక్కున తాళం పడ్డది. విశేషమేమంటే హాయిగా, వీనులవిందుగా ఏదో వినబడుతూంది. ఆ అబ్బాయి పాడుతున్నాడు.

"ఈ విశాల-ప్రశాంత-ఏకాంత సౌధములో... నిదురించు జహాపనా!" అబ్బా! ఏమిటి ఈ మధుర గాత్రం! ఆ పాట వింటున్నంతసేపూ నన్ను నేనే మర్చిపోయాను. నిజంగా అతని గొంతులో ఏదో

సమ్మోహన శక్తి వుంది. అనిర్వచనీయమైన జీవం ఉంది. నది కరవట్ల త్రొక్కుతూ ప్రవహించినట్టుగా కొంతసేపు, గాలికి చిన్న చిన్న అలలుగా నీరు కదులుతూ పోతున్నట్టు కొంతసేపు అనిపించింది. ఈ భావం నాకొక్కర్తికేనా లేక!...మా వాళ్లు ఏంచేస్తున్నారో అని వాళ్ళవైపు క్షణం చూశాను. నోళ్ళు ఆవలించి వింటున్నారు.

“అయ్యో! పాట అయిపోయిందే!” అని అనుకుంటూ ఉంటే యింకో అబ్బాయి ఎత్తుకున్నాడు. పాపం, పాట రాకపోయినా ఉత్సాహంగా ముందుకు వచ్చినట్టున్నాడు ‘చెలియా కనరావా’ అంటూ. ఇంక మాకు నవ్వాగలేదు ఆ అపశ్రుతులు వినలేక. అది అయింతర్వాత వాళ్లు వెళ్ళిపోయారు.

ఆరాత్రి నాకు నిద్రపట్టలేదు. నిముష నిముషానికీ ఆ గొంతు నా చెవిలో వినిపిస్తూనే ఉన్నట్టు నేనూహించాను. ‘అయ్యో! ఎప్పుడూ నా ప్రక్కన ఒకరు అలా ఆలాపిస్తూ ఉంటే ఎంత హాయిగా ఉండును.’ అని ఊహించుకుంటూ ఉండగానే నాకు తెలియకుండా, నా నోటిలో నుండి ‘ఈ విశాల—ప్రశాంత’ అని వచ్చింది. అలా నెమ్మదిగా ఆపాట పాడుతూ అతని గాత్రం నా గొంతులో విందామని ప్రయత్నించాను. అది భ్రమ కాక మరేమిటి! ఇంతలో మా జానకి “ఏమిటే ఆ కూనిరాగాలు—పాడమంటే పాడవుగాని, అర్ధరాత్రి అంకమ్మ శివాల్లాగ చాల్లే! ఇంక నిద్రపో!” అనేసరికి నిద్రాదేవిని ఆహ్వానించే ప్రయత్నంలో పడ్డాను.

ప్రతిరోజూ ఆ అబ్బాయిని చూడాలని ఉండేది. ఇదంతా ప్రేమకు మొదటి మెట్టనీ, నేనా అబ్బాయిని గాఢంగా ప్రేమించాననీ మీరనుకుంటే, మిమ్మల్ని నిరుత్సాహపరచిన దాన్నవుతాను. అదేమిటో! ఆ అబ్బాయిపట్ల గౌరవం, అభిమానం ఏర్పడ్డాయి. అతని గొంతు ప్రతినిత్యం వినాలని, దాన్ని నా స్వాంతం చేసుకొని స్వాధీన పర్చుకోవాలని ఉండేది. ఎంత స్వార్థం! ఈ ఉద్దేశాలేగాని మరే యితర కోరికా నాలో కలగలేదు. ఇంకో సంగతి; ఆ అబ్బాయి గొంతు నేను విన్నాను. కాని నాకు పాటలొచ్చునని అతనికి తెలియదే! ఎలా! అది అతనికి ఎలాగైనా తెలియజెయ్యాలి అనుకున్నాను.



అదృష్టం దేనికైనా కలసిరావాలని పెద్దలంటారు. ఆ ట్రైనింగ్ సమయంలో సాయంత్రం ఒక సమావేశము జరుగుతుంది. దానిని "ఫ్రెండ్స్ ఇన్ కౌన్సిల్" అంటారు. అక్కడ తప్పనిసరిగా పాటలో నాటకాలో వెయ్యాల్సిందే! అదే మంచి అదను అనుకున్నాను. మొదటిరాత్రి మా వాళ్లు నన్ను పాడమని చంపి, బ్రతిమాలి నేను బిగుసుకునే సరికి విసుగేసి మానివేశారు. కాని తర్వాత నాకు యీ ఆలోచన వచ్చి పాడాలని తీర్మానించుకొని ఆ రాత్రి పాడదామనుకున్నాను. మా వాళ్ళతో నేను పాడుతున్నానని ముందుగా చెప్పలేదు.

అనుకున్నట్టుగా ఆ సమయం రానేవచ్చింది. మా వంతు వచ్చేసరికి నేనందుకున్నాను.

"సా విరహే తవ దీనా...కృష్ణా!"

అదేమిటో, నేను పాడుతూంటే ఆ పాట నాకే మధురంగా వినిపించింది. ఇది వరకీ పాట ఎన్నో సార్లు పాడాను. కాని అంత శ్రావ్యంగా రాలేదు. నెమ్మదిగా పాడుతూనే అతను ఎక్కడున్నాడోనని నా కళ్లు ఒకసారి అందర్నీ తిలకించాయి.

"అదిగో! అక్కడ కూర్చున్నాడు. ఆ పాడేది ఎవరా అని చూస్తున్నాడు గాబోలు! ఆ! ఇటు చూశాడు. నన్ను చూశాడు"...నేను ముఖం యిటు తిప్పి పాట పూర్తి చేశాను.

కార్యక్రమం అయినతర్వాత మా బృందం—

"ఏమే! ప్రమీలా! నిజంగా యివాళ ఏమిటి అలా దంచేశావ్! మన కాలేజీ పేరు నిలిపావులే" అని జానకి, "సెబాష్! అలా ఉండాలి. కంగ్రాట్యులేషన్స్!" అని మా రామి. ఇలా—ఇంతలో ఆ అబ్బాయి మా వైపు రావటం నేను చూశాను. అరే! అదేమిటి, నా గుండె ఎందు కలా కొట్టుకుంటోంది?

"మీరు చాలా బాగా పాడారండీ! కంగ్రాట్యులేషన్స్!"

"థాంక్స్! మీకన్న బాగా పాడగలనా?"

"అరె! అదేమిటి, మీ పాట ముందు నా పాటొక లెక్కా!" ఇంకా యిలాగే మా సంభాషణ సాగింది. ఆ రాత్రి ఆ సంతోషంలో నాకు చాలా సేపటివరకూ నిద్రపట్టలేదు.

అక్కడ ఉన్న ఆ మూడురోజుల్లోనూ ఎలాలేదన్నా ఒక పదిసార్లు అతని పాట వినే అదృష్టం నాకు కల్గింది. మేమంతా యిక వెళ్ళిపోయే రోజు దగ్గరకు వస్తుంటే—నాకు ఇంటికి వెళ్తాను గదా అని ఒక వైపు సంతోషం—మరొక వైపు అయ్యో ఇక నాకు ఆ గాత్రం వినే అవకాశం ఉండదే అని చింత—

సరే! ఆ రోజు రానే వచ్చింది. స్టేషన్లో మేమంతా చాలా హడావిడిగా తిరుగుతున్నాం. అతను కూడా ఉన్నాడు. అరే! ఇటే వస్తున్నాడే! బహుశా ఆఖరిగా గుడ్ బై చెప్పటానికేమో!

"మీరు తిన్నగా కాలేజీకి వెళ్తారా? లేక మీ యింటికా?" అని అడిగాడు. మేమంతా వేరే ఊళ్ళనుంచి వచ్చి గుంటూరులో బి. యిడి. చదువుతున్నామని తెలిసికొని వుంటాడు.

"ముందు గుంటూరు వెళ్తామండీ! తర్వాత వీలుంటే ఇండ్లకు వెళ్తాము."

"మళ్ళీ ఎప్పుడు కలుస్తాం?" అన్నాడు—అకస్మాత్తుగా అడిగినట్లనిపించింది నాకు. కొంతసేపటి వరకూ ఏం చెప్పటానికీ తోచలేదు. తర్వాత నెమ్మదిగా—

"ఎలా చెప్పగలం! బొందిలో ప్రాణం అంటూ ఉంటే మళ్ళా ఎప్పుడైనా మీ పాట వినే భాగ్యం కల్గుతుంది.' అనగల్గాను

ఇలా అంటూ ఉండగానే ట్రయిను స్టేషను లోకి వచ్చేసింది. అతని దగ్గర సెలవు తీసుకొని బండి ఎక్కాను.

• • •

అది జరిగి చాలా ఏళ్ళయింది. తర్వాత నా జీవితంలో చాలా మార్పులు కల్గాయి. ట్రైనింగ్ పూర్తిచేసి ఉద్యోగంలో చేరడం, పెళ్ళి చేసుకోవడం అన్ని తంతులూ పూర్తయాయి. మా వారికి పాటలంటే చాలా యిష్టం. ఎప్పుడూ వారు మాత్రం పాడరు. తీరిక ఉన్నప్పుడల్లా నా చేత పాడించుకుంటూ మా సుశీల అన్నట్టుగా నా వైపు ఆప్యాయంగా చూస్తూ ఉండిపోతారు. ఇప్పటి వరకూ మళ్ళీ నేను మధుమూర్తిని చూడ్డంగాని, ఆయన పాట వినటంగాని జరుగలేదు. కాని ఆశ మాత్రం ఉంది—ఎప్పటికైనా కలుసుకొని ఆయన పాట వినగలనేమో అని. కాని ఆయన ముసలాడై మనవళ్ళనెత్తుతున్న తర్వాత మే మొకవేళ కలుసుకుంటే పాడతాడా? బహుశా, మనవడిచేత పాడిస్తాడేమో. ★